క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితులకు సెల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

మర్పల్లి: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు.. పోలీసులు తిరిగి ఫోన్లు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మర్పల్లి మండలం దార్గులపల్లి, బూచన్‌పల్లి, పంచలింగాల గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో మూడు సెల్‌ఫోన్ల ఆచూకీ తెలుసుకుని, వాటిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధిత వ్యక్తులకు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి సెల్ ఫోన్లను అందజేశారు.

ఆర్‌బీఎల్ ఎండీని కలిసిన రూరల్ సీఐ



శ్రీనివాస్‌రెడ్డితో రూరల్ సీఐ

యాలాల: మండల పరిధి జక్కేపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్(రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్) ఎండీ, ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డిని గురువారం తాండూరు రూరల్ సీఐ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరులో శాంతిభద్రతల పరిరక్షణకు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా సీఐ పేర్కొన్నారు.

జీపీ భవనం ప్రారంభం

పెద్దేముల్: రూ.20లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మండల పరిధి నాగులపల్లిలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని తాజామాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సురేఖలు ప్రారంభించారు. తాజామాజీలు ఉప సర్పంచ్ మల్లారెడ్డి, వార్డు సభ్యులు శేఖర్ రెడ్డి, హరికరెడ్డి, లక్ష్మి, బస్వరాజ్, రాంచంద్రారెడ్డి, సత్యమ్మ, హెచ్.లక్ష్మి, నగేశ్ ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



బాలింతతో బంధువులు, 108 సిబ్బంది

కొడంగల్ రూరల్: 108 వాహనంలో ఓ తల్లి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణశివారులో నివాసముండే మహాలక్ష్మికి బుధవారం రాత్రి పురిటినొప్పులు రావడంతో.. ఆమె తల్లిదండ్రులు జంగయ్య, జమ్మక్కలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రాత్రి ఒంటి గంట సమయంలో వైద్యులు లేరని, తాండూరు ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించారు. చేసేది లేక 108లో మహాలక్ష్మిని తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో అప్పాయిపల్లి గేటు సమీపాన ఆమెకు సాధారణ కాన్పు అయిందని 108 సిబ్బంది అశోక్, శ్రీకాంత్‌లు తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు లేరని చెప్పడం, గర్భిణులను రెఫర్ చేయడం సిబ్బందికి షరామామూలైందని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.

యూజీడీ సమస్యలు లేకుండా చూడాలి



సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: పట్టణంలో యూజీడీ సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం కమిషనర్ జాకిర్ అహ్మద్‌తో కలిసి 25వ వార్డులో పర్యటించారు. డ్రైనేజీ నీరు బయటకు వస్తుందని స్థానికులు చెప్పగా.. మున్సిపల్ సిబ్బందిని పిలిపించి, మరమ్మతులు చేయించారు. బీట్ల మార్కెట్‌కు సంబంధించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకురాగా.. ఆ ట్యాంక్‌ను తొలగించాలని మార్కెట్ అధికారులకు ఆమె సూచించారు. వార్డులో వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటంతో చెత్త సమస్య ఎక్కువగా ఉంటుందని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

కుల్కచర్ల: సోషల్ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థులలో సాంఘికశాస్త్రంలో ఉన్న పరిణతిని గుర్తించేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీపరీక్షలో కేజీబీవీ విద్యార్థులు అఖిల, ఇందులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయులు పరందాములు, శేఖర్, రాములు, అజ్మత్, అనిల్, లక్ష్మి ఉన్నారు.

ప్రగతి పథంలో పల్లెలు

పచ్చదనంతో మెరిసిపోతున్న గ్రామాలు

- మాజీ సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమాల్లో నేతలు, అధికారులు
- నేటి నుంచి ప్రత్యేక పాలన షురూ



పెద్దేముల్: మాజీ సర్పంచ్‌లకు సన్మానం

మోమిన్‌పేట: పల్లెల్లో సంపూర్ణ పరిశుభ్రత కనిపిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మోమిన్‌పేట మండలం టేకులపల్లి గ్రామంలో గురువారం పంచాయతీ పాలకవర్గ పదవీ వీరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారిందన్నారు. నిత్యం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, తయారు చేసిన ఎరువులను హరితహారంలో నాటిన మొక్కలకు వేయడం వలన.. పల్లెలు పచ్చదనంతో మెరిసిపోతున్నాయని వివరించారు. చాలా గ్రామాల్లో భూగర్భ మురుగు కాల్వలను నిర్మించడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం వలన రానున్న రోజుల్లో దోమలు లేని పంచాయతీలుగా మారుతాయని పేర్కొన్నారు.

పారదర్శక పాలనకు నిదర్శనం

మాజీ సర్పంచ్ నవనీతరెడ్డి తన ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో పాటు.. ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్, మండల పరిషత్ నుంచి వచ్చిన గ్రాంట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఖర్చులతో సహా వివరించడం పారదర్శక పాలనకు నిదర్శనమని చైర్మన్ కొనియాడారు. రైతు వేదికలు, శ్మశాన వాటికలు, కంపోస్టు షెడ్లు, నూతన పంచాయతీ భవనాల నిర్మాణం తదితర పనులు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజా, గ్రామ సేవను దృష్టిలో పెట్టుకొని పనులు చేయాలని సూచించారు. అంతకు ముందు జీపీ కార్మికులను సన్మానించి ఎర్ర బంగారంతో తులాభారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవనీత రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రైయిస్, వార్డు సభ్యులు, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ సర్పంచ్ శ్రీరాంలు, నాయకులు ఖదీర్, మైపాల్, బిక్షపతిగ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

పదవీ లేకున్నా ప్రజాసేవలో..

యాలాల: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల సేవలు మరువలేనివని ముద్దాయిపేట ఎంపీటీసీ దేవగారి రాములు, కాంగ్రెస్ యువ నేత సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం అన్నసాగర్ జీపీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ రత్నమ్మను సన్మానించారు. సర్పంచ్‌తో పాటు పంచాయతీ వార్డు సభ్యులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. పదవీ లేకున్నా ప్రజాసేవలో తాము ఎప్పుడూ ముందుంటామని పాలక సభ్యులు పేర్కొన్నారు. జీపీ కార్యదర్శి అంజిలయ్య ఉన్నారు.

గ్రామస్తులకు రుణపడున్నా..

తాండూరు రూరల్: రెండుసార్లు తనపై నమ్మకంతో సర్పంచ్‌గా ఎన్నుకున్న మల్కాపూర్ గ్రామ ప్రజలకు రుణపడి ఉన్నానని మాజీ సర్పంచ్ సిరిగిరిపేట్ విజయలక్ష్మి అన్నారు. మల్కాపూర్ జీపీ కార్యాలయ ఆవరణలో స్థానిక పాలక సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవిసింధే, మాజీ ఉప సర్పంచ్‌లు అబ్దుల్ మాజిద్, హస్సేన్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పండరి, హెచ్‌ఎం నాగప్ప, నాయకులు పండరిచారీ, కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కొడంగల్ రూరల్: గ్రామాల అభివృద్ధికి స్థానిక పాలకవర్గ సభ్యులు కృషిచేశారని, సీసీరోడ్లు, స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇచ్చి, పచ్చదనం వెల్లివిరిసేలా కృషి చేశారని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మహ్మద్ యూసుఫ్, ఆనంద్‌రెడ్డిలు కొనియాడారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగింపు సందర్భంగా పట్టణంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో తాజామాజీ సర్పంచులు రమేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పకీరప్ప, అనంతమ్మ, శంకర్‌నాయక్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సోమశేఖర్, ఏన్గుల భాస్కర్, అంబయ్యగౌడ్, అమరేందర్‌గౌడ్, సంజు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: గ్రామ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న విజయలక్ష్మి తదితరులు

సర్పంచ్ పదవే.. సంతృప్తి

ఎంపీపీ అరవింద్‌రావు



పాలక సభ్యులను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

పరిగి: ప్రజాప్రతినిధిగా ఎంత పెద్ద పదవి అనుభవించినా.. సర్పంచ్ పదవితోనే ప్రజలతో నేరుగా సత్సంబంధాలు ఏర్పడతాయని, ఆ పదవే తృప్తినిస్తుందని ఎంపీపీ అరవింద్‌రావు తెలిపారు. మండల పరిధి మాదారం గ్రామంలో పాలకవర్గం పదవీకాలం ముగియడంతో సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపీపీ సన్మానించారు. అనంతరం మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ పాలకవర్గం పాత్ర ఎంతో కీలకమన్నారు. సర్పంచ్ అంటే ఎంతో ఓపికతో కూడిన పదవి అని, అన్ని వర్గాల ప్రజలతో మమేకమై, వారికి ఎల్లవేళలా సేవలందించాల్సి ఉంటుందని వివరించారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంతో సర్పంచ్, వార్డు సభ్యులు ముందుంటారని పేర్కొన్నారు. ఎంపీడీఓ శేష గిరిశర్మ, సర్పంచ్ రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్, హన్మంత్ రెడ్డి ఉన్నారు.



యాలాల: రత్నమ్మను సన్మానిస్తున్న ఎంపీటీసీ తదితరులు



మోమిన్‌పేట: జీపీ కార్మికులకు తులాభారం వేస్తున్న మాజీ సర్పంచ్ నవనీతరెడ్డి తదితరులు



మాజీ సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



కుల్కచర్ల: పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న అధికారులు

ప్రజాసేవలో పదవీ విరమణ ఉండదు..

తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మప్ప

పెద్దేముల్: ప్రజాసేవలో పదవీ విరమణ ఉండదని, గ్రామాలకు సర్పంచులు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మప్ప అన్నారు. స్థానిక పాలకవర్గ పదవీ విరమణ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం, సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజాసేవలో పదవీ విరమణ ఉండదని, కేవలం సేవాదృక్పథం మాత్రమే ఉంటుందన్నారు. గ్రామాలకు సేవ చేసిన వారిని ఎవరూ మరువలేరన్నారు. ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులే.. జీవితానికి సంతృప్తినిస్తాయని చెప్పారు. సర్పంచ్ హోదాను పదవీగా భావించరాదని, ప్రజాసేవగా భావించాలని వివరించారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారనే భావనతో ఉండరాదని, వారు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తారని చెప్పారు. ఇందులో ఎస్‌ఐ కాశీనాథ్, ఎంపీఓ షేక్‌సుస్మా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్, గెమ్యా నాయక్, ముకుందురెడ్డి, శాంతప్ప, తాజామాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, హైదర్, ద్యావరి విజయమ్మ, రుక్మమ్మ, పద్మ, శివలీల, మేహన్‌రెడ్డి, చంద్రప్ప, వీరప్ప, శ్రావన్‌కుమార్, భరత్, శంకర్, పాండు నాయక్, గోవర్దన్, రాములు, రెగోండి లక్ష్మీ, సువర్ణ, తులసి, రుక్కిబాయి, శివాలి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

దోమ: ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. గురువారం మండల పరిధి కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పర్యావరణంపై ఏర్పాటు చేసిన అవగాహనలో ఆయన మాట్లాడారు. స్వార్థపూరితంగా కొందరు చేసే పనుల వలన పర్యావరణం కాలుష్యం అవుతుందని విద్యార్థులకు తెలిపారు. ముఖ్యంగా చెట్లను నరకడం, అడవులకు నిప్పు పెట్టడం లాంటివి పర్యావరణంతో పాటు జీవకోటికి ముప్పు కలిగిస్తుందని చెప్పారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే తప్పనిసరిగా అడవులను, చెట్లను రక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకటేష్, ఉపాధ్యాయులు గోపాల్, మహేందర్ బహదూర్, బీమ్యానాయక్, వాణి, విజయలక్ష్మి, శ్రీలత, శ్రీనివాస్, అమృత, బాలమణి, శాంతి, మల్లేశం, కిరణ్, నర్సింహులు, సీఆర్‌పీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కుల్కచర్ల గ్రామానికి చెందిన శివని హన్మయ్యకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. గత ఏడాది ఆ ఇంటి ఇల్లాలు చనిపోవడంతో వారి సంరక్షణ తండ్రే చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న హన్మయ్య కుటుంబానికి మాదారం గ్రామానికి చెందిన సాయిరాం అండగా నిలిచాడు. గురువారం రూ.30వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు సాయిరాం ముందుకు రావడం హర్షణీయమనిన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, మాజీ సర్పంచ్ సొమ్యారెడ్డి, మ్యాజిక్ బస్ కోఆర్డినేటర్ నర్సింహులు, నాయకులు జోగు వెంకటయ్య, జె.వెంకటయ్య, రాములు, బాలు, బిచ్చయ్య, ఎల్లయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్ రూరల్: పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ మూగజీవాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. గురువారం పట్టణంలోని పశు వైద్యశాలలో వెటర్నరీ ఏడీ డాక్టర్ నోవా, సిబ్బంది ఆధ్వర్యంలో మేలు రకం పశువులకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ.. శిబిరాన్ని ప్రారంభించి రైతులకు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్యాధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. పాల దిగుబడిని అందించేందుకు మేలు జాతి పశువులు లాభదాయకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు రియాజ్ అహ్మద్, పరశురాం, సిబ్బంది వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నాసిరకం గుడ్లా?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- అంగన్‌వాడీలు సమయ పాలన పాటించడం లేదని మండిపాటు



అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న సభ్యులు

దౌల్తాబాద్: అంగన్‌వాడీలు పిల్లలకు నాసికరం గుడ్లు పంపిణీ చేస్తూ.. వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని మాజీ సర్పంచ్ శిరీష ఆరోపించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అంగన్‌వాడీల నివేదికపై సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతుండగా.. మాజీ సర్పంచులు హరికృష్ణ, రెడ్యానాయక్ కలగజేసుకొని అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా కేంద్రాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దీనికి స్పందించిన సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ.. నాసిరకం గుడ్లు సరఫరా అయినట్టైతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని, అదే విధంగా అంగన్‌వాడీలు సమయపాలన పాటించే విధంగా చూస్తామని చెప్పారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వండి..

మండలంలో రైతులు పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోవాలని, అలా అయితేనే మార్చిలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఏఈ శ్రీపతి రెడ్డి పేర్కొన్నారు. పీఆర్‌ఏఈ రవికిరణ్ మాట్లాడుతూ.. మండల పరిధి 22 గ్రామాలకు పంచాయతీ భవనాలు మంజూరైతే.. ఇప్పటివరకు కేవలం ఒక్కటి మాత్రమే పూర్తి చేశారని వివరించారు. ఎంపీటీసీ మంజుల మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఓ కాలనీకి మిషన్‌భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఏఈ శివకు తెలిపారు. ఎంఈఓ వెంకటయ్య నివేదిక చదువుతుండగా.. మనఊరు-మనబడిలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచులు కోరారు. అనుబంధ గ్రామాల్లో రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చూడాలని వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కోరారు. ముఖ్యఅతిథిగా జెడ్పీచైర్మన్ సునీత, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీడీఓ తిరుమల స్వామి, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

టాలెంట్ గుర్తించేందుకే టెస్టులు

మండల విద్యాధికారి హరిశ్చందర్



పరిగి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

పరిగి: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాధికారి హరిశ్చందర్ నాయక్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని నంబర్ 2 ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సమాజంపై అవగాహన..

ఈ టెస్టులతో సమాజంపై పిల్లలకు అవగాహన పెరుగుతుందని ఎంఈఓ అన్నారు. ఇలాంటి పరిక్షలు ఎక్కడ నిర్వహించినా విద్యార్థులు భయపడకుండా పాల్గొనాలని సూచించారు. వీటిల్లో నెగ్గిన వారు ఎలాంటి పోటీ పరిక్షలనైనా సునాయసంగా ఎదుర్కోగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, సాంఘికశాస్త్రం ఫోరం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నిరంజన్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు మనోహర్, రాజేందర్, జావిద్, అమర్‌నాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండల స్థాయిలో అర్హత సాధించిన ముగ్గురిని శనివారం జిల్లా సోషల్ టాలెంట్ టెస్టుకు ఎంపిక చేస్తామని సోషల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్ తెలిపారు. తెలుగు మాధ్యమం నుంచి స్వాతి(అగ్గనూరు), శిరీష(రాస్నం), ఆఫ్రీన్(రాస్నం), నవీన్(జుంటుపల్లి) ఇంగ్లిష్ మీడియం నుంచి ప్రార్థన(యాలాల), అక్షయ(యాలాల), సాయికీర్తన(యాలాల), విజయలక్ష్మి(అగ్గనూరు), రవి కుమార్ (అగ్గనూరు)లను జిల్లా స్థాయి టెస్టుకు పంపించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, సాంఘిక శాస్త్ర మండల ఉపాధ్యాయులు మంజుభాషిణి, రవి, చంద్రశేఖర్, వెంకటేషం ఉన్నారు.

పల్లెల్లో ఇక 'ప్రత్యేక' పాలన

- గెజిటెడ్ ఆఫీసర్ల నియామకం
- ఒక్కో అధికారికి నాలుగైదు జీపీల కేటాయింపు
- నేటి నుంచి బాధ్యతల స్వీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ నారాయణరెడ్డి



తాండూరు రూరల్: పంచాయతీల్లో సర్పంచుల పాలన గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నేటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో గెజిటెడ్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గెజిటెడ్ ఆఫీసర్లకు మాత్రమే అవకాశం ఇవ్వడంతో తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో ఒక్కో అధికారికి మూడు, నాలుగు జీపీల బాధ్యతలు అప్పగించారు.

ఏ ఊరికి ఎవరు?

జిల్లా ఉద్యానశాఖ అధికారి చక్రపాణికి (చిట్టిఘనాపూర్, వీర్‌శెట్టిపల్లి, ఎల్మకన్నె), తహసీల్దార్ తారాసింగ్(కరన్‌కోట్ గ్రామం), ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి (ఓగిపూర్, పర్వాతాపూర్), పంచాయతీ డీఈ వెంకట్రావ్ (గౌతపూర్, గుండ్లమడుగుతండా), మిషన్ భగిరిథ డీఈ రమేష్ (కోటబాసుపల్లి, కోత్లాపూర్), ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ (బెల్కటూర్, బిజ్వార్), సీడీపీఓ రేణుక (సంకిరెడ్డిపల్లి, సిరిగిరిపేట్), డీటీ విజయేంధర్ (అంతారం), ఎంపీఓ రతన్‌సింగ్ (అల్లాపూర్, అంతారంతండా), పంచాయతీ రాజ్ ఏఈ నందిని (చెన్‌గేస్‌పూర్, చంద్రవంచ), ఎంఈఓ వెంకటయ్య (చెంగోల్, చింత మణిపట్నం), వ్యవసాయ శాఖ ఏఓ రజిత (గోనూర్, జినుగుర్తి), ఇరిగేషన్ ఏఈ సాయిబన్న (గుంతబాసుపల్లి, ఐనెల్లి, ఖాంజాపూర్), మిషన్ భగిరథ ఏఈ ప్రతిభ (మల్కాపూర్), ఆర్డీఓ కార్యాలయ డీటీ చంద్‌పాషా(మిట్టబాసుపల్లి, నారాయణపూర్), మిషన్ భగిరథ ఏఈ ప్రణీత్ (రాంపూర్‌మిదితండా, సంగెం కలాన్), ఉద్యాన శాఖ తాండూరు నియోజకవర్గ అధికారి మల్లికార్జున్ (ఉద్దాండపూర్, వీరారెడ్డిపల్లి)లను కేటాయించారు.

బషీరాబాద్‌లో ఏడుగురు..

బషీరాబాద్: పంచాయతీలను ప్రభుత్వం 'గెజిటెడ్' అధికారుల చేతుల్లో పెట్టడంతో నేడు వారు బాధ్యతలు స్వీకరించనున్నారు. బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఏడు మంది ప్రత్యేక అధికారులను నియమించారు. వీరిలో తాండూరు డివిజన్ పీఆర్ ఈఈ రాములు, మిషన్ భగీరథ డీఈఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ వెంకటస్వామి, డీటీ వెంకటయ్య, మండల వ్యవసాయ అధికారి సూర్య ప్రకాశ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హథిరామ్, ఎంపీఓ రమేష్ ఉన్నారు.

గ్రామాల కేటాయింపు..

ఈఈ రాములుకు (బాద్లాపూర్, బాద్లాపూర్‌తండా, బషీరాబాద్, బోజ్యానాయక్‌తండా), ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేష్‌కు (దామర్‌చెడ్, ఎక్మాయి, గొట్టిగ కలాన్, రెడ్డిఘణాపూర్, వాల్యానాయక్‌తండా, జలాల్‌పూర్, జీవన్గీ), డీఈఈ విజయ్‌కుమార్‌కు (గొట్టిగఖుర్దు, హంక్యానాయక్‌తండా, ఇందర్‌చెడ్, ఇస్మాయిల్‌పూర్, అల్లాపూర్), తహసీల్దార్ వెంకటస్వామికి (మైల్వార్, మన్‌సాన్‌పల్లి, మంతన్‌గౌడ్, మంతన్‌గౌడ్‌తండా, మంతట్టి), డీటీ వెంకటయ్యకు బాబునాయక్‌తండా, కంసాన్‌పల్లి(బి), కంసాన్‌పల్లి(ఎం), కాశీంపూర్‌ను కేటాయించారు. మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్‌కు (కొర్విచెడ్, కొర్విచెడ్‌గని, కొత్లాపూర్, కుప్పన్‌కోట్, క్యాద్గీరా), వెటర్నరీ అధికారి హథిరామ్‌కు మర్పల్లి, నంద్యానాయక్‌తండా, నవల్గా, నావంద్గీ, నీళ్లపల్లి, పర్వత్‌పల్లిలో బాధ్యతలు అప్పగించారు.

మోమిన్‌పేట మండలంలో..

మోమిన్‌పేట: మండల పరిధి 28 పంచాయతీల పాలకవర్గం పాలన బుధవారంతో ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి నాలుగైదు గ్రామాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జీపీ ఎన్నికలు జరిగే వరకు వీరి పాలన కొనసాగనుంది.

ఎవరు.. ఎక్కడ?

తహసీల్దార్ మనోహర చక్రవర్తి (అంరాధికలాన్, అంరాధికుర్దు, చిన్న కోల్కుంద, మేకవనంపల్లి, కోల్కుంద), ఏఈఈ పీఆర్ ప్రణీత్ కుమార్ (బాల్‌రెడ్డి గూడ, చీమల్‌దరి, చక్రంపల్లి, దేవరంపల్లి), వ్యవసాయ అధికారి జయశంకర్ (దుర్గంచెర్వు, ఇజ్రాచిట్టంపల్లి, సయ్యద్‌అల్లిపూర్, రాంనాథ్‌గుడుపల్లి, మల్లారెడ్డిగూడెం), ఏఈఈ మిషన్ భగీరథ నయనశ్రీ (కాస్లబాదు, బూర్గుపల్లి, రాళ్లగుడుపల్లి, లచ్చానాయక్‌తండా), ఎంపీడీఓ శైలజారెడ్డి (కేసారం, ఏన్కతల, ఎన్కేపల్లి, గోవిందాపూర్), ఎంపీఓ యాదగిరి (వెల్‌చాల్, మొరంగపల్లి, టేకులపల్లి, చంద్రాయన్‌పల్లి, మక్తతండా), మండల ప్రత్యేకాధికారి చరితరెడ్డి (మోమిన్‌పేట)లు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభం

దోమ: మనఊరు మనబడిలో పనుల్లో భాగంగా పాఠశాలకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని పాఠశాల పరిధిలోకి తీసుకొని, ప్రహరీ పనులను చేపడుతున్నామని మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్ అన్నారు. గురువారం మండల పరిధి బొంపల్లి జిల్లా పాఠశాలలో ప్రహరీ విస్తరణ పనులను ప్రధానోపాధ్యాయులు వెంకట్, షఫీతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, స్కూల్ చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు వెంకటయ్య, నీల్‌సింగ్, గ్రామస్తులు బెస్త చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఏఈకి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. యాలాల, గోవిందరావుపేటలో కొన్నేళ్లుగా ట్రాన్స్‌ఫారం లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయాన్ని స్థానిక నేత పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతలు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆయా గ్రామాలకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయిస్తూ ట్రాన్స్‌కో అధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు రైతులు గురువారం ఎమ్మెల్యే రాసిన లేఖను ట్రాన్స్‌కో ఏఈకి అందజేశారు. అడిగిన వెంటనే తమ సమస్యను తీర్చిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, నాయకులు మైనొద్దీన్, బసప్ప, బాలప్ప, సాయిలు, అహ్మద్, మోయిజ్, లాలు, చందు, చిన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.